గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట బుధవారం పర్యాటక శోభను సంతరించుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కోటలోని నగీనా బాగ్‌లోని అక్కన్నమాదన్న కార్యాలయం, ఆయుధాగారం సందర్శనకు పర్యాటకులు బారులు తీరారు. క్లాపింగ్ పోర్టికో అద్భుతాన్ని చూసేందుకు పోటీపడ్డారు. కోటలోని ఫౌంటేన్, ఫిరంగుల వద్ద యువకులు, జంటలు ఉత్సాహంగా ఫోటోలు దిగారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కొందరు పర్యాటకులు క్రిస్మస్ తాత టోపీలతో ఆకట్టుకున్నారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ



రోగులకు దుప్పట్లు అందజేస్తున్న అంజదుల్లాఖాన్

చార్మినార్: ఎంబీటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఖాయంఖాన్ 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం బుధవారం పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, స్వెట్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజ్లిస్ బచావ్ తహ్రీఖ్(ఎంబీటీ) అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షాను సస్పెండ్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సుధీర్‌కుమార్ తివారీ తదితరులు

అబిడ్స్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పార్లమెంట్ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుధీర్‌కుమార్ తివారి (గుల్లు మహారాజ్) అన్నారు. బుధవారం ధూల్‌పేట రహీంపురాలో అమిత్‌షాకు వ్యతిరేకంగా ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. వెంటనే ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్ సింగ్, కైలాష్ సింగ్, రూపేష్ సింగ్, అక్షయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థుల నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని మాస్టర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య, స్థిరమైన అభివృద్ధి అనే శీర్షికతో సాగిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గుడిమల్కాపూర్‌లో..



లంగర్‌హౌస్‌లో..



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

ఘనంగా వాజ్‌పేయి శతజయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ తదితరులు

చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ బృందం : భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లంగర్‌హౌస్‌లో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషి చేయాలి

యాకుత్‌పురా: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు ఎనలేనివని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నేతలు అన్నారు. వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా బుధవారం ఓబీసీ మోర్చా రెయిన్ బజార్ డివిజన్ అధ్యక్షుడు హతీరాజు దేశాయ్ అధ్వర్యంలో యాకుత్‌పురా ఈస్ట్ చంద్రనగర్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ జైస్వాల్, బీజేవైయం యాకుత్‌పురా కన్వీనర్ ఈశ్వర్ యాదవ్, నాయకులు శివరాం, రాజు, నర్సింగ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి జయంతి వేడుకల్లో పాల్గొన్న గోపాల్‌జీ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్



ధూల్‌పేట్‌లో..



నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు



పురానాపూల్ వద్ద..



ఎడ్ల పండరీనాథ్ ఆధ్వర్యంలో..

నేడు జేబీ.రాజు 85వ జన్మదిన వేడుకలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళిత ఉద్యమ నాయకుడు డాక్టర్ జేబీ.రాజు 85వ జన్మదిన వేడుకలను ఈ నెల 26న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లు రవి, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్నలతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



జియాగూడ: అణగారిన వర్గాల హక్కుల సాధనకు అలుపెరగని పోరాటం చేసిన నాయకుడు దివంగత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. బుధవారం జియాగూడ 2బి హెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్, శివబాగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి అత్యుత్తమ రాజ్యాంగం అందించిన ఘనత అంబేడ్కర్‌కు దక్కుతుందన్నారు. ఈశ్వర్, శ్రీరాములు, బాల్‌రాజ్, కిషోర్, అశోక్‌కుమార్, బల్దేవ్ సింగ్, టి.నర్సింగ్‌రావు, అభిషేక్ మిత్ర పాల్గొన్నారు.

వరద నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: వరద నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఇందులో భాగంగా నాలాల విస్తరణ, పూడిక తీత పనులు చేపట్టామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. ఆదివారం ఆయన రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి యాకుత్‌పురా, అజ్మత్‌నగర్, లండన్ బ్రిడ్జి, యస్రబ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ కొనసాగుతున్న నాలా పనులను పరిశీలించారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాలకు వరద నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్

బండ్లగూడ: వ్యక్తిగత... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు ప్రబలకుండా పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో కిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిల వద్ద నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... క్రిస్మస్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, తౌఫిక్, రాము తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నిరంతర వైద్య సేవలు



కొనసాగుతున్న అభివృద్ధి పనులు

దూద్‌బౌలి: పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి అన్నారు. బుధవారం ఆమె ఆసుపత్రిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతతూ వైద్య సేవలతో పాటు కనీస సౌకర్యాలైన మంచి నీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల మంజూరైన నిధులతో ఆసుపత్రిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. వైద్య సేవల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



దాదావాడి జైన్ మందిర్‌లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కావ్యారెడ్డి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎన్.గౌతమ్ రావు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని దాదావాడి జైన్ మందిర్‌లోని వృద్ధాశ్రమంలో బుధవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యారెడ్డి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదావాడి జైన్ మందిర్ నిర్వాహకులు ఒంటరిగా వృద్ధాశ్రమంలో కాలం గడుపుతున్న వారికి తామున్నామంటూ వారికి భరోసా ఇస్తున్నారన్నారు. యువత సేవా గుణం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పి.విజయానంద్, బీజేవైఎం నగర కార్యదర్శి దేవర వంశీ, బీజేపీ నగర కార్యదర్శి భుజేందర్, బీజేపీ మహిళా మోర్చా కన్వీనర్ రాణి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎస్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నాంపల్లి: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా నగర శాఖ ప్రధాన కార్యదర్శి బి.ప్రకాష్ సింగ్ నేతృత్వంలో బుధవారం రెడ్‌హిల్స్ డివిజన్ పరిధిలోని చింతలబస్తీలో బల్దియా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి కాంతికిరణ్, ఓబీసీ మోర్చా నగర శాఖ అధ్యక్షులు జి.వినోద్ కుమార్, డివిజన్ అధ్యక్షులు కొల్లూరు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

11న ప్రకృతి ఒడిలో సంక్రాంతి సంబరాలు

బంజారాహిల్స్: ప్రకృతిని కాపాడాలి, ప్రకృతి విలువ, మొక్కల విలువను నగరవాసులకు తెలియజేసేందుకు ఈసారి సంక్రాంతి వేడుకలను తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు ప్రముఖ రైతు నాగరత్నం నాయుడు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీ ఫిలిం సిటీ సమీపంలోని ధైరా గ్రామంలో జనవరి 11వ తేదీన సంబరాలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే వారికి కుండల తయారీ, ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ వంటి వినోదాత్మక క్రీడలు కూడా ఉంటాయన్నారు. అదేవిధంగా బీడు భూమిలో తాను ఎన్నో ప్రయోగాలు చేసిన అద్భుతాలను సైతం నగరవాసులకు పరిచయం చేస్తానన్నారు. వ్యవసాయ రంగంలో తాను చేసిన ప్రయోగాలకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 437 అవార్డులు లభించినట్లు తెలిపారు.

ప్రేమను పంచడమే క్రీస్తు తత్వం



బహదూర్ పురా: ప్రేమను పంచడమే క్రీస్తు బోధనల సారాంశమని పాస్టర్ మోహన్ చౌదరి అన్నారు, చార్మినార్ నియోజకవర్గం పాల్కి గార్డెన్ లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ బుర్ర గళ్ళ ఆనందం స్థానిక పాస్టర్లు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా పాస్టర్ మోహన్ చౌదరి క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు, మజ్లిస్ పార్టీ అన్ని వర్గాలను చేరదీస్తూ ప్రాధాన్యం ఇస్తుందని కులమత భేదాలు చూడదని ఎమ్మెల్యే అన్నారు, పాస్టర్ .బి.ఆనందం .కనాన్ ఫెలోషిప్ ఆరాధన మినిస్ట్రీస్ పురానాపూల్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి సిస్టర్ సంధ్య, బిషప్ కె జె. ఉదయ్ రాయ్ బుషన్ బ్రో.బి.ధరమ్ రాజ్. పాస్టర్ . జె.బాల్రాజ్ ,పాస్టర్ కె.బాలకిష్టయ్య అలియాస్ క్రిస్టాఫర్, బ్రదర్ .ధనరాజ్ , బ్రదర్ పి.శామ్యూల్ దివాకర్ పాస్టర్ సిస్టర్ పద్మిని . సామాజిక నాయకురాలు పుష్పాంజలి, బహదూర్‌పుర సమన్వయకర్త బి.కాలేబ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు

చార్మినార్: ఉచిత మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయ్ శత జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో బుధవారం పాతబస్తీ దారుషిఫాలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ మెడికల్ సెల్ తెలంగాణ, కామినేని ఆసుపత్రి సంయుక్తాధ్వర్యలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నాదెండ్ల భాస్కర్‌రావు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ..వైద్య శిబిరాలు స్థానికులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

దినసరి కూలీలకు అండగా ఉంటాం



టోలిచౌకీ లేబర్ అడ్డా వద్ద కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: లేబర్ అడ్డాల వద్ద కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ లేబర్ అడ్డాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న కూలీలతో మాట్లాడారు. టోలిచౌకీ చౌరస్తా సుందరీకరణ పనులు పూర్తయిన వెంటనే లేబర్ అడ్డా వద్ద ఉండే కూలీల కోసం ప్రత్యేకంగా హెల్త్ పాయింట్ ఏర్పాటు చేయిస్తామన్నారు. వారికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బల్దియా సహకారంతో చౌరస్తా వద్ద మరో ఉచిత భోజన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి స్థానిక కూలీల నుంచి ఇబ్బందులు కలగకుండా చూస్తానన్నారు. అవసరమైతే చౌరస్తా వద్ద పోలీసు ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేయిస్తానన్నారు. గతంలో చౌరస్తా వద్ద ఔట్‌పోస్టు ఉండేదని, అనివార్య కారణాల వల్ల పోలీసులు దానిని తొలగించారన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు కూలీలు నిర్భయంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్రాంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు



సంక్రాంతి మహోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఆలయ ఈఓ తదితరులు

గోల్కొండ: నానల్‌నగర్ సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లి గడ్డలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి దేవాలయంలో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ సి.వసంత అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆమె కమిటీ మాజీ సభ్యులు, భక్తులతో కలిసి సంక్రాంతి మహోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయన్నారు. మహర్షులు లోక కల్యాణార్థం ఇక్కడ యాగాలు చేశారన్నారు. సప్తరుషుల యాగంతో ప్రసన్నుడైన శ్రీ రంగనాయక స్వామి వైశాక సుద్ధ చతుర్దశి రోజున జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చినట్లు తెలిపారు. జ్యోతి కనిపించిన ప్రదేశంలోనే శ్రీ రంగనాయక స్వామి ప్రతిష్ఠాపన జరిగిందన్నారు. దశాబ్దాలుగా ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జనవరి 13,14,15వ తేదీల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా రంగోళి పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.నర్సింహ, సోమారపు జనార్దన్, అశోక్‌కుమార్, ఎస్.శ్రీకాంత్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



అంబేడ్కర్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రైస్ట్ నిస్సి చర్చ్‌లో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ రాజ్‌కుమార్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా అంబేడ్కర్ నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆరాధనల అనంతరం కేక్ కట్ చేశారు. పాస్టర్ ప్రభు కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సంఘ పెద్దలు ఎన్.దుర్గయ్య, ఎస్.ప్రకాష్, కె.జగన్, జి.శ్రీనివాస్, పి.ప్రభాకర్, బి.సందీప్ కుమార్, ఎ.జాన్సన్, ఎస్.అనిల్‌కుమార్, బి.సువార్తమ్మ, ఏలియాస్ తదితరులు పాల్గొన్నారు. అరుంధతి కాలనీ, రక్షాపురం, హాషామాబాద్ తదితర ప్రాంతాలలోని బాప్టిస్ట్, బ్యూలా, ఫేత్ ఎంబీ చర్చీల్లోనూ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు.